క్లుప్తంగా

జీజీహెచ్‌లో గ్లోషైన్ బోర్డు ఏర్పాటు



గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్ ఆవరణలో రోటరీ క్లబ్ సెంటినియల్ గుంటూరు వారు వితరణగా అందజేసిన గ్లోషైన్ బోర్డును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆస్పత్రి అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ అనేక మార్లు ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సాయం అందిస్తుందని, క్లబ్ సేవలు విలువైనవని కొనియాడారు. సుమారు రూ.75 వేలు విలువ చేసే బోర్డును ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం రోటరీ క్లబ్ సెంటినియల్ గుంటూరు అధ్యక్షుడు పానకాల బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నవీన్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు డాక్టర్ వీర రాఘువ, సంతోష్, కోట మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఉపాధ్యాయుడు షేక్ ఖయ్యూం విద్యార్థులకు న్యూ సైంటిఫిక్ ఇన్వెన్షన్స్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా మంచి కథలు చెప్పారు. శిబిరంలో గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హెల్త్ యూనివర్సిటీ వీసీకి అభినందనలు



గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా నియమితులైన డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను మంగళవారం ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది వై.ఠాగూర్ యాదవ్ అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మెడికల్ అడ్మిషన్లు మరింత పారదర్శకంగా జరిగేలా చూడాలని, తల్లిదండ్రులు ఆందోళనకు గురికాకుండా ఉండేలా చూడాలన్నారు. అడ్మిషన్‌లలో అభ్యర్థుల శ్రేయస్సుకు ఎలాంటి నష్టం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ప్రధాని మోదీ ఇప్పుడు ఏం తెస్తున్నారో చెప్పాలి

లక్ష్మీపురం: దాదాపు పదేళ్ల కిందట అమరావతి రాజధాని పనుల కోసం వచ్చి మట్టి నీళ్లు తెచ్చిన ప్రధాని మోదీ, పనుల పునఃప్రారంభానికి మళ్లీ ఇప్పుడేం తెస్తున్నారో చెప్పాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రజలు ఆలోచించాలని కోరారు.

ఉగ్ర దాడికి నిరసనగా ర్యాలీ



గుంటూరు ఎడ్యుకేషన్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్లిన అమాయక ప్రజలను అమానుషంగా చంపిన కరడు కట్టిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి ఇకపై ఇటువంటి చర్యలకు పాల్పడకుండా మన దేశం గట్టిగా బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాల నుంచి పాత స్వామి థియేటర్ సర్కిల్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన అభాగ్యులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్ రాజా పాల్గొన్నారు.

ఐబీఎస్‌తో చిరాకు పడొద్దు

- ప్రతిరోజూ జీజీహెచ్‌కు 30 మంది బాధితులు
- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న ఐబీఎస్ కేసులు
- ఏప్రిల్ అవగాహన మాసం ఇది


'రేపల్లెకు చెందిన జానీ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగి. ఇటీవల కడుపులో సమస్య, మోషన్ సక్రమంగా అవ్వకపోవడం వంటి సమస్యలతో చికిత్స కోసం వైద్యులను సంప్రదించాడు. పని ఒత్తిడి వల్ల జానీ ఇరిటబుల్‌బవల్ సిండ్రోమ్(ఐబీఎస్)తో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స చేశారు.' ఇలా ఎంతో మంది ఒత్తిడి వల్ల ఐబీఎస్ బారిన పడుతున్నట్లు వైద్యులు తెలిపారు. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోతే జీవితాంతం సమస్య వెంటాడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఏప్రిల్ ఇరిటబుల్‌బవల్ సిండ్రోమ్ అవగాహన మాసం ఇది. – గుంటూరు మెడికల్

వ్యాధి కారణాలు..

పేగులు అవసరానికి మించి చిరాకుపడి కదలడాన్నే ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ అని పిలుస్తారు. మానసిక ఒత్తిడి, ఆందోళన, ఐబీఎస్‌కు ముఖ్య కారణం. ఎక్కువగా మహిళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. వాంతులు, విరోచనాలు అయిన తరువాత కూడా పేగులు పరుగెత్తడం, కడుపు బిగదీయడం, వికారం వంటి లక్షణాలు ఉంటాయి. కొందరిలో ఆహారం సరిపడక పేగుల్లో అలర్జి మొదలై వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. చిన్నపిల్లల్లో కడుపులో పేగుల్లో ఇన్‌ఫెక్షన్ సోకితే అది కొంత వయస్సు వచ్చాక కూడా ఇన్‌ఫెక్షన్ వలన ఐబీఎస్ వస్తుంది. పేగుల్లో ఉండే చెడు బ్యాక్టీరియా వలన వ్యాధి సోకుతోంది. ఎక్కువగా 20 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు వారిలో ఈ వ్యాధి సోకుతోంది.

లక్షణాలు..

కడుపులో మంట, నోటిలో పుల్లని నీరు ఊరుతాయి. కడుపు ఉబ్బరం, కొంచం తిన్న కడుపు నిండినట్లు ఉండటం. విరోచనానికి వెళ్లినా కడుపులో



ఐబీఎస్ పోస్టర్లు

ఇంకా ఏదోమిగిలి ఉన్నట్లు అనిపిస్తుంది. కొందరికి పొట్టలో మెలిబెట్టినట్లు నులినొప్పి వస్తుంటుంది. కొందరికి విరోచనాలు అవుతాయి. కొందరికి పూర్తిగా మోషన్ ఆగిపోయి మలబద్ధకం ఉంటుంది.

బాధితులు ఇలా..

గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగానికి వివిధ రకాల సమస్యలతో ప్రతిరోజూ 150 మంది చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 60 నుంచి 70 మంది ఐబీఎస్ వ్యాధి బాధితులే. జిల్లాలో 15 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ 15 నుంచి 30 మంది బాధితులు చికిత్స కోసం సంప్రదిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు.

ప్రశాంత జీవనం గడపాలి



ఎక్కువగా ఆందోళన చెందడం మానేసి ప్రశాంతంగా ఉండడం ద్వారా ఐబీఎస్ కంట్రోల్‌లో పెట్టవచ్చు. ఆందోళనను దూరం చేసే విధంగా ఏదైనా వ్యాపకం కల్పించుకోవాలి. మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగ, ధ్యానం చేయాలి. కారం, మసాలా, పులుపు పదార్థాలు తగ్గించాలి. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి. ఫాస్ట్‌ఫుడ్స్ తినకూడదు. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్

- 16 ఏళ్ల సమస్యకు చెక్ పెట్టిన వైద్యులు
- కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్



వివరాలు వెల్లడిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ, ఎ.కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: కామెర్ల సమస్యతో 16 ఏళ్లుగా బాధపడుతున్న మహిళకు గుంటూరు జీజీహెచ్ వైద్యులు కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్ చేసి సమస్యకు చెక్ పెట్టారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బందర్‌కు చెందిన 44 సంవత్సరాల నాంచారమ్మకు 16 సంవత్సరాల క్రితం కామెర్ల వ్యాధి సోకింది. స్థానిక ప్రైవేటు వైద్యులు ఆమెకు వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం మరో కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు ఆటో ఇమ్యూనో డిసీజ్ అని నిర్ధారణ చేశారు. 15 ఏళ్లుగా మందులు వాడుతూనే ఉంది. చికిత్స కోసం ఖర్చు భరించలేక జీజీహెచ్‌లో చేరారు. తొలుత గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పసరునాళంలో రాయిని తీసి, స్టంట్ వేసినట్లు వివరించారు. పసరు తిత్తు, బల్ల సమస్య కోసం తమ వద్దకు రిఫర్ చేశారన్నారు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా బటన్ హోల్ ల్యాప్రోస్కోపి ఆపరేషన్ ద్వారా పసరుతిత్తి, ఉబ్బిన బల్లను (స్లీన్) విజయవంతంగా ఒక్క ఆపరేషన్‌తో తొలగించామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు, జనరల్ సర్జరీ వైద్యులు నాగ సంతోష్‌కుమార్, సాదిక్ బాషా, వేణుగోపాల్, మేఘన, అవిన్, హరి, మత్తు వైద్యులు పోలయ్య, శ్యామ్‌సన్, స్వేత, రిచి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కవిత, నాగూర్‌బాషా, శివరామకృష్ణ, అనిల్, నవీన్ పాల్గొన్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు. ఆపరేషన్ విజయవంతమయ్యేందుకు సహకరించిన జనరల్ సర్జరీ విభాగాధిపతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి 16 ఏళ్ల రోగి సమస్యను నయం చేసిన జనరల్ సర్జరీ వైద్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందనలు తెలిపారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి



షేక్ సకీనా(80) ముఖంపై గాయాలు

లక్ష్మీపురం: ఓ వృద్ధురాలి మృతిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీనారాయణపురం ప్రాంతానికి చెందిన కిరసనాల్ మస్తాన్, షేక్ సకీనా(80) దంపతులు. వీరికి సంతానం లేదు. మస్తాన్ అస్మత్ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు ఆరుగురు సంతానం ఉన్నారు. అయితే మస్తాన్, రెండో భార్య అస్మత్ అనారోగ్య కారణంగా మృతి చెందారు. అప్పటి నుంచి మొదటి భార్య సకీనా అదే ఇంట్లో నివాసం ఉంటోంది. రెండో భార్య అస్మత్ కుమారులు సకీనాను చూసుకుంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కుమారులు ఎవరి పనికి వారు మంగళవారం ఉదయం వెళ్లిపోయారు. అయితే అదే ఇంట్లో ప్రత్యేక గదిలో ఉంటున్న వృద్ధురాలు కాలు జారీ కిందపడటంతో తలకు తీవ్రమైన గాయం అయింది. పనులు చేసుకుని తిరిగి వచ్చిన కుమారులు చూసే సరికి సకీనా మృతి చెంది ఉండటంతో పాటు గాయం అయిన ప్రాంతంలో పాటు పలు చోట్లు చీమలు పట్టి ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలి మృత దేహాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

మే 20న దేశ వ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి



ఐరన్ ముఠా కార్మికులకు సన్మాన పత్రాలను అందజేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: కార్మిక హక్కులు హరించి వేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసన మే 20వ తేదీ నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు పేర్కొన్నారు. గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయంలోని రేగుల రాఘువయ్య భవనంలో నగర ముఠా కార్మిక సంఘం కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల నడ్డివిరుస్తోందని ఆరోపించారు. నగర ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు జి. సురేష్ బాబు మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ముఠా కార్మిక సంఘం నాయకులు పి.వెంకటరెడ్డి, పి.రోసిరెడ్డి, వి.శ్రీను, లక్ష్మయ్య, ఎల్.శ్రీనివాసరావు, కె.కోటయ్య, ఎం.పిచ్చయ్య, ఇట్టే అమరలింగం పాల్గొన్నారు.

చర్చలతోనే సమస్యకు పరిష్కారం

సీపీఐ నాయకుడు అజయ్ కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: చత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులో చేపట్టిన కగార్ ఆపరేషన్ పేరుతో పౌరులను చంపుతున్నామనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని, తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ సూచించారు. చంపటం ఒకటే సమస్యకు పరిష్కారం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాము చర్చలకు సిద్ధమంటూ అనేకమార్లు నక్సల్స్ ప్రకటించినప్పటికీ వారి అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సమంజసం కాదని అన్నారు. కశ్మీర్ పహల్గాంలో ఇటీవల జరిగిన దారుణాన్ని దేశంలోని అన్ని పార్టీలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయని అన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్‌లో పర్యటించకుండా బిహార్ ప్రచారానికి వెళ్లడాన్ని ఆయన తప్పు పట్టారు. తక్షణమే కశ్మీర్‌లో పర్యటించి దేశ ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.

వాడవాడలా మే డే వేడుకలు..

మే ఒకటిన వాడవాడలా మే డే వేడుకలను గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అరుణ పతాకాలు ఎగురవేసి సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు, పార్టీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె. రాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రధాని సభకు భారీగా తరలి రావాలి

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ మే 2న హాజరు కానున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలి రావాలని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ కోరారు. స్థానిక కొత్తపేటలో తూర్పు నియోజకవర్గంలోని మండల అధ్యక్షుల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రధాని అమరావతికి విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా తరఫున ప్రతి మండల నుంచి అధిక సంఖ్యలో నాయకులను, కార్యకర్తలను, అభిమానులను బహిరంగ సభలో పాల్గొనే విధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో పలు మండలాల అధ్యక్షులు సురేష్ కుమార్ జైన్, లక్ష్మణ్, పురుషోత్తం, రామకృష్ణ, శ్రీను, పవన్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో రోజు ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



పట్నంబజారు: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎర్ర రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ సుబ్బారావు ఆధ్వర్యంలో గుంటూరు-1, 2 డిపో కార్మికులు, ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిపో-1 కార్యదర్శి శంకరరావు, డిపో-2 కార్యదర్శి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాపై తుది అవగాహన సదస్సు నేడు

నెహ్రూ నగర్: స్మార్ట్ టెక్స్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మే 15వ తేదీలోగా నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు బుధవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తుది అవగాహన సదస్సు జరుగుతుందని, రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువత తప్పనిసరిగా హాజరు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10వ తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉండేలా సుమారు 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా మే 15వ తేదీలోగా గుంటూరు మెగా జాబ్ మేళాని బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నామని చెప్పారు. ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగాల కల్పనకు, ఈ నెల 30న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం 9 నుంచి వర్క్ షాప్ జరుగుతుందని వివరించారు.

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన ఫణిదం చిన్నబాబు నగరానికి వచ్చి జీవిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరిని మెడిసిన్ చదివించారు. పెద్ద కుమార్తె సౌదామిని పీజీ చేస్తోంది. మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన పెద్ద కుమార్తె ఇంటికి తిరిగి రాకపోవడంతో చిన్నబాబు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వావిలాల గోపాలకృష్ణయ్యకు నివాళి

లక్ష్మీపురం: ప్రజా సేవకు జీవితాన్ని త్యాగం చేసిన అసమాన త్యాగశీలి వావిలాల గోపాలకృష్ణయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం తరువాత అనేక ఉద్యమాల్లో వావిలాల ముందు వరకుసలో ఉన్నారని గుర్తు చేశారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



గుంటూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉగ్రదాడి నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు, జీఆర్పీ సీఐ అంజిబాబు విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐలు మాట్లాడుతూ అనుమానంగా ఉన్నట్లు ప్రయాణికులు గమనిస్తే తక్షణమే తమకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు. రైల్వే స్టేషన్, అలాగే డివిజన్ సంబంధిత కార్యాలయల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తనిఖీలలో ఆర్పీఎఫ్ ఎస్ఐ నారాయణ రెడ్డి, మహిళా ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.

ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, ఉర్దూ అకాడమీ సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుంటూరు ఉర్దూ షేక్ మొహమ్మద్ ఖాసిం పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధిలో భాగంగా గుంటూరులోని ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాష ప్రాముఖ్యత, విద్య, ఉద్యోగావకాశాలపై రూపొందించిన పోస్టర్లను మంగళవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉర్దూ డీఐ ఖాసిం మాట్లాడుతూ ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్ ఉందని, ఉర్దూ భాష ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఉర్దూ భాషతో భారతదేశానికి విడదీయరాని అనుబంధం ఉందని, ఉర్దూ కేవలం ముస్లింల భాష కాదని, అది భారతీయుల భాష అని చెప్పారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉర్దూ మాధ్యమంలో చదివిన ఎంతో మంది అత్యున్నత పదవుల్లో రాణిస్తున్నారని అన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యను ఉర్దూ మాధ్యమంలో చదివిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ సహా ఉన్నత ఉద్యోగాలు, ఉన్నత కేడర్లలో ఉన్నారని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉర్దూ మాధ్యమంలో చదివించే దిశగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ కార్యాలయ సిబ్బంది షేక్ అక్బర్, ఫక్రుద్దీన్ అలీ, నయీమ్, రఫీ, అబ్దుల్లా ఖాన్, మెహబూదున్నీసా, మల్లికా సుల్తానా మరియు నాగూర్‌బాషా పాల్గొన్నారు.

క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఫాదర్ సతీష్‌కుమార్

నెహ్రూనగర్: క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏఈఎల్‌సీ వెస్ట్ ప్యారిస్ చర్చ్ ఫాదర్ రెవరెండ్ సతీష్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి ఏడు రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో క్రైస్తవులు శాంతికాముకులని, హింసవాదులు కాదని, చర్చిల్లో పాస్టర్ల బోధన ద్వారానే సమాజంలో నేర ప్రవృత్తి తగ్గిపోతుందన్నారు. అటువంటి క్రైస్తవుల పట్ల ప్రభుత్వం సానుభూతి వైఖరి కలిగి ఉండాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి విషయంలో నిజాలను వెలికితీయాలని, గుంటూరు నగరంలో క్రైస్తవుల సమాధుల కోసం స్థలాలను కేటాయించాలని కోరారు. దీక్షల్లో సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, డొక్కా జార్జీ, విజయలక్ష్మి, మార్కు, ఎం.ప్రేమజ్యోతిబాబు, రత్నకుమార్, మోషే పాల్గొన్నారు.

ముందస్తు పన్ను రూ.61.97 లక్షలు చెల్లించిన లలితా హాస్పిటల్స్



రెవెన్యూ సిబ్బందికి చెక్కును అందజేస్తున్న రాఘవ శర్మ

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించి పన్నుపై 5 శాతం, బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ పొందేందుకు బుధవారం ఒక్కరోజే గడువు ఉందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం లలిత హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ రాఘవ శర్మ ముందస్తు పన్ను రూ.61.97 లక్షలు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోగా పన్ను ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ఇప్పటికే నగరంలో పన్ను చెల్లింపుదారులు రూ.48.33 కోట్లు చెల్లించారని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా చివరి రోజైన బుధవారం రాత్రి 10 గంటల వరకు క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

వైద్య కళాశాల మెయిన్ గేటు ప్రారంభం



వైద్యకళాశాల గేటును ప్రారంభిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 2002 బ్యాచ్‌కు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాలలో మెయిన్ గేటు నిర్మాణానికి రూ.8 లక్షలు విరాళంగా అందజేశారు. నిర్మాణ పనులు పూర్తవడంతో మంగళవారం డాక్టర్ పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి కళాశాల మెయిన్‌గేటును ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు పెద్ద మనస్సుతో సాయం చేస్తున్నారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సాయంతో కళాశాలను కార్పొరేట్ సంస్థలకంటే ధీటుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. జింకానా, పలు స్వచ్ఛంద సంస్థలు, పలువురు పారిశ్రామిక వేత్తలు, కళాశాల అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తున్నారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో లైట్లు వేశారోచ్..

సాక్షి ఎఫెక్ట్



స్విమ్మింగ్ పూల్‌లో లైట్లు సిద్ధం చేసిన నగరపాలక సంస్థ అధికారులు

లక్ష్మీపురం: ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో లైట్లు లేవని సాక్షిలో ఈనెల 11వ తేదీ కథనం ప్రచురితమైంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. స్విమ్మింగ్ పూల్‌లో ఒక వైపు వెలగకుండా ఉన్న లైట్లు స్థానంలో కొత్తవి వేశారు. అయితే మే ఒకటో తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో చిన్నారులకు, వారి కోసం వచ్చే తల్లి దండ్రులకు అన్ని విధాల సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారో లేదో వేచి చూడాల్సి ఉంది. అయితే ఈ ఎన్టీఆర్ స్టేడియానికి సంబంధించిన క్రీడా ప్రాంగణానికి, ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన కో ఆర్డినేటర్ కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలున్నాయి.